# నా ప్రేమ కథ

నేను చాలమంది అమ్మాయిలను ప్రేమించటం నిజం. ఇంత మంది వెంట తిరిగిన ప్రేమ నిజమైన ప్రేమ కాదనీ, అసలది ప్రేమే కాదనీ తీర్మానించాడు ఒక ప్రబుద్ధుడు. ఒకతను మరీ ఇదిగా నా దగ్గరకు వచ్చి అడిగాడు కూడా, 'నిజంగా నే ప్రేమించావా ?' అంటూ. ప్రేమలో కూడా నిజంగానూ, అబద్ధంగానూ అని రెండు తరగతులున్నాయని నాకు తెలియదు. మనస్ఫూర్తిగానే వాళ్ళందరినీ అభిమానించాను. 'నువ్వు లేకపోతే నేను బ్రతకలేను. నువ్వు నిరాకరిస్తే చచ్చిపోతాను' అంటూ సినిమా డైలాగులు చెప్పకపోయినా, వాళ్ళందరికీ భారతమంత 'లవ్ లెటర్సు' వ్రాయకపోయినా, నేను హృదయపూర్వకంగానే వాళ్ళంకు 'పడిచచ్చి' పోయాను.

'నువ్వు దేన్ని చూసి ఫలానా అమ్మాయిని ప్రేమించావ్ ?' అని నా మిత్రుడొకడు అడిగాడు, ఇంటర్వ్యూ జరుపుతున్న విలేఖరి ఫోజులో. 'ఆమె ముక్కు బాగుందని' అని ఠకీమని జవాబిచ్చాను. ఒక్క ముక్కు కోసం ప్రేమించటం మహాపరాధం అన్నట్లు మొహం పెట్టాడు.

ఆమాటకొస్తే, నేను ప్రేమించిన పడతులందరూ అటువంటికోవకు చెందినవారే. దస్తూరీ బాగుందని ఒకమ్మాయినీ, క్లాసులో నిర్భయంగా ప్రవర్తించేదని ఇంకో అమ్మాయిని ఇష్టపడ్డానుచిన్నప్పుడు. కొద్దిగా పెరిగిన తరువాత, ముక్కు బాగుందనీ, నోరు అందంగా వున్నదనీ, కళ్ళు చక్కగా విశాలంగా ఉన్నాయనీ, జడ పెద్దదనీ ఇలా ఎన్నో కారణాలుకనబడి చాలమంది



ద్వితీయ బహుమతి [రూ. 25]

ఆర్. కాళిదాసు
[ఫోర్త్ బి. ఇ. మెకానికల్. ఇంజనీరింగ్ కాలేజ్. అనంతపురం.]

అమ్మాయిలను ప్రేమించాను. కాలేజీ కల్చరల్ ప్రోగ్రాములో చక్కగా పాట పాడిందనీ, ఇంకొకమ్మాయి బొమ్మలు వేస్తుందనీ - ఇలా ఎంతోమందిని ఆరాధించాను - ఇటువంటివే నా ప్రేమ పురాణాలన్నీను.

చదువు పూర్తయి ఉద్యోగంలో చేరాక కూడా ప్రేమ నన్ను వదలలేదు. ఎందరో అమ్మాయిలు తారసపడ్డారు, నా హృదయాన్ని పట్టుకొని పోయారు.

ఈ ప్రేమ ప్రవాహంలో నేనెక్కడికి కొట్టుకుపోతానో నాకు తెలియదు. ప్రేమ కథలకు వివాహం ముగింపు అనేది నిజమైతే- నా కథను ముగించటానికి ఎవరు సిద్ధపడతారు? – ఈ విషయాలను ఇంతకు ముందెప్పుడూ ఎక్కువగా ఆలోచించలేదు.

కానీ, వారం రోజుల క్రితం మా మేనమామగారింటికి వెళ్ళడంతో నా ప్రేమ కథ హఠాత్తుగా ముగింపుకు వచ్చిందని తెలిసింది. నే నిన్ని రోజులూ, ప్రేమ ప్రేమ అంటూ దేని వెంబడి తిరిగానో, అది నిజమైన ప్రేమకాదనీ, ప్రేమకు మహత్తరమైన బరువు బాధ్యత లున్నాయని నాకు భానుమతిని చూస్తేనే గాని తెలియలేదు. భానుమతి మా మేనమామ కూతురు. బొద్దుగా చామనచాయగా ఉండే భానుమతి ప్రబంధ సుందరికాదు. ఆ మాట కొస్తే సుందరేకాదు

భానుమతి నన్ను అదోకరకంగా చూడటం మొదలు పెట్టింది. నేను వాళ్ళింటికి వచ్చి రెండు రోజులు కాకమునుపే భానుమతి తనకు నా పట్ల ఉన్న ఆదరాభిమానాలతో నన్ను కట్టి పడేసింది. తేరుకోలేక పోయాను ఆ అనురాగ సముద్రం నుంచి. భానుమతి నా చుట్టూ నాకు తెలియకుండానే పెనవేసుకొని పోయింది. ఈ సత్యాన్ని నేను రెండు, మూడురోజులు ఆలస్యంగా కనుక్కున్నాను. నేను ఇరవైమంది అమ్మాయిల వెంట తిరిగిన పచ్చి నిజం కూడా ఆమెని, ఆమె ప్రేమను ఏమీ చెయ్యలేక పోయింది.

ఇదివరలో 'నువ్వు ఫలానా అమ్మాయిని ఎందుకు ప్రేమించావ్?' అని నన్ను అడిగితే, 'ఫలానా గుణం' చూసి అని చెప్పేవాణ్ణి. కానీ, భానుమతి నాలో ఏ సుగుణం చూసి నన్ను ప్రేమించిందో నాకు అంతు పట్టలేదు. భానుమతిలో గల ఈ సుగుణాన్ని చూసే, రవిమని ఆమెని ప్రేమించటం మొదలుపెట్టాను.

□□□